# శివమాయ

* రచన: శ్రీ అందుకూరి పరమేశ్వరరావు *

ఒకప్పుడు మహాశివరాత్రి నాడు పార్వతీ పరమేశ్వరులు వింతలూ, విశేషాలు ప్రత్యక్షంగా చూడాలని బయలుదేరారు.

మొదట శివాలయం వద్ద బ్రాహ్మణ దంపతులు పూజలు, నమస్కారాలు చేయడం చూశారు. కాని వారికేమి సంతృప్తి కలగలేదు. అక్కడ నుండి బయలుదేరి ఒక కొబ్బరితోట వైపు వెళ్ళారు. అక్కడ ఒక యజమాని ఒక కుర్రవాడిచేత కొబ్బరి కాయలు తీయించుకొని, వాడికిస్తానన్న రెండు కాయలు ఇవ్వక, ఒక కాయే చేతిలో పెట్టి వెళ్ళి పొమ్మన్నాడు. ఆ తీయించిన కాయలన్ని ఒలచి శివుడి అభిషేకానికి తిసుకువెళ్ళాడు.

అది చూసి పార్వతి అంది నాథా! ఆ భక్తుడికి మీరంటే ఎంత భక్తి వుందో చూడండి'.

అందుకు ఈశ్వరుడు "కాదు దేవి అతడు నిజమైన భక్తుడు కాడు. దొంగ బేరాలు పెట్టి సంపాదించిన డబ్బుతో నాకు పూజ చేస్తే అది నేనెలా సహిస్తాను ?" అన్నాడు.

తరువాత అక్కడ నుండి బయలుదేరి చిత్ర విచిత్రాలన్నీ చూస్తూ పార్వతీ, పరమేశ్వరులు ఒక ముసలి అవ్వను చూశారు. ఆ అవ్వ కడుబీదరాలు. తనకున్నది ఒక ఆవు దాని దూడ అప్పుడే అవ్వ పాలు తీయడానికి బయలుదేరి ముందు దూడను బాగా త్రాగనిచ్చి, తన గ్లాసుకు సరిపడేట్టు తీసుకొని, తక్కిన పాలన్నీ దూడకు వదిలివేసింది. తీసిన పాలను పట్టుకొని శివాలయానికి బయలుదేరింది ఇది కనిపెడుతున్న పార్వతీ పరమేశ్వరులు ఆ అవ్వ గుణాన్ని పరిక్షిద్దామని ఒక ముసలి దంపతులుగా మారి 'దాహం! దాహం' అనుకుంటూ ఆ అవ్వకు ఎదురయ్యారు.

ఆ మాటలు విని అవ్వ వారికి దాహం తీర్చుకోమని గ్లాసుతో పాలు యిచ్చేసింది. ఒకచుక్క వుంచుకుండా మరీ త్రాగేశారు మారువేషంలో వున్న పార్వతీ పరమేశ్వరులు. అవ్వ దానికేం విచారించలేదు. ఇక మిగిలిందల్లా ఖాళీ గ్లాసేగా!

అప్పుడు అవ్వ ఏటికి వెళ్ళి గ్లాసు నిండా నీళ్ళు తెచ్చుకొని దాంట్లో ఒక పుష్పం వేసి శివాలయంలో ప్రవేశించి భక్తితో శివలింగంపైని ఆ నీరు ధార పోసింది. దాంతో అప్పటివరకు కొన్ని కోట్ల కొబ్బరి కాయల నీరుపోసిన నిండని ఆ కుండీ ఒక్కమారే నిండిపోయింది. అది చూసి అక్కడ వున్న ప్రజలంతా ఆశ్చర్యపడ్డారు. ఈ విచిత్రాన్ని చూసి తిరిగి కైలాసానికి మరలిపోతున్నప్పుడు త్రోవలో పార్వతి శివున్ని అడిగింది.

'నాథా! అంతమంది బ్రాహ్మణోత్తములు ఎన్నో కొబ్బరికాయలు కొట్టి ఎంత నీరు పోసినా నిండని ఆ కుండీ ఒక్క గ్లాసుతో ఎలా నిండింది?'

అందుకు శివుడు 'లేదు దేవీ! వారు భక్తి అంతా నా మీద వుంచిన మాట నిజమే! అయితే యింటి వద్ద చిన్నపిల్లలు ఏడుస్తున్నా వారి ఆకలి తీర్చకుండా ముందు నాకు పెట్టినట్లయితే నాకెలా సంతృప్తి అవుతుంది? కాని ముసలి అవ్వ వుందంటే అలా చెయ్యలేదు. ముందు దూడకు ఆకలి తీర్చింది తక్కినవి దాహంతోవున్న వాళ్ళని తెలుసుకొని ముసలివారి దాహం తీర్చింది. ఆఖరికి భక్తితో యిచ్చిన పట్టినీళ్ళే నాకు సంతృప్తి అయ్యాయి. నాకు సంతృప్తి అయినప్పుడే ఆ కుండీ నిండుతుంది' అన్నాడు.

ఇదే కదా 'శివమాయ' అనుకుంది పార్వతి.

★